## గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, జూన్ 9: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల బాలుర కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఈ నెల 13న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయ్ ప్రకటనలో పేర్కొన్నారు. బాలుర గురుకుల కళాశాలలో సీఈసీ, ఏ అండ్ టీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని, ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని ఈ నెల 13న కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వివరాలకు 8790724953, 8693898246 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## కేజీబీవీ ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్స్

చిలిపిచెడ్, జూన్ 9: మండలంలోని చిట్కుల్ కేజీబీవీలో ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. కస్తూర్బాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. బైపీసీలో 40 సీట్లు కేటాయించారు. జిల్లా, మండలంలో చదువుకునే విద్యార్థులకు అవకాశం కల్పించారు. కేజీబీవీలో పీజీసీఈ ఆర్టీలుగా ఇంటర్మీడియట్‌లో బైపీసీ బోధించేందుకు పీజీలో 60 శాతం మార్కులు సాధించిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. తెలుగు, ఆంగ్లం, వృక్షశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో బోధించే వారు కావాలని అధికారులు తెలిపారు.

## నిజాంపేటలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ



ఉపాధి హామీ సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

నిజాంపేట, జూన్9: నిజాంపేటలోని రైతువేదికలో 4వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అదనపు డీఆర్డీవో రంగాచార్యులు హాజరయ్యారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31,2025 వరకు 8 రకాల ఉపాధి పనులకు మండలంలోని 14 పంచాయతీల్లో రూ.3.37 కోట్ల ఖర్చు అయినట్లు అధికారులు తేల్చారు. కార్యక్రమంలో డీవీవో శ్రీహరి, ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, ఏపీవో శ్రీనివాస్, టీఏలు రవితేజ, శశిరేఖ, మమత, పీఆర్‌ఏఈ శరత్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో ఖర్చులు తగ్గించుకోవచ్చు

కౌడిపల్లి, జూన్ 9: పంట వేసుకోవడానికి ముందే భూసార పరీక్షలు చేయించుకుంటే సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని అస్క్ నత్నాయిపల్లి శాస్త్రవేత్త శోభారాణి, సైంటిస్టు లక్షణ్‌రావు తెలిపారు. సోమవారం కంచన్‌పల్లిలో మండల వ్యవసాయ అధికారి స్వప్న జాదవ్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సాహితి, రైతులు పాల్గొన్నారు.

## 205 గ్రాముల ఆల్ఫాజోలం పట్టివేత



నిందుతుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

నర్సాపూర్, జూన్9: 205 గ్రాముల ఆల్ఫాజోలంను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న ఘటన పెద్దచింతకుంటలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా డీటీఎఫ్ గోపాల్ మాట్లాడుతూ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో పెద్దచింతకుంట గ్రామంలో కల్లులో ఉపయోగించే ఆల్ఫాజోలం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తి వద్ద 205 గ్రాముల ఆల్ఫాజోలం లభించిందన్నారు. అతడిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌హెచ్‌వో నర్సాపూర్‌కు అప్పజెప్పినట్లు తెలిపారు. దాడుల్లో ఎసై బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, రవి, నరేశ్, హరీశ్, నవీన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట, జూన్ 9: నేడు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ తిరుపతిరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. రామాయంపేట సబ్ స్టేషన్‌లోని 132/33కేవి మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు రామాయంపేట ఫీడర్ పరిధిలోని దామరచెర్వు, కోమటిపల్లి, గొల్పర్తి, అక్కన్నపేట, ఝాన్సీలింగాపూర్, లక్ష్మాపూర్, దంతెపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 9: జిల్లాలో గుర్తింపు లేకుండా నడిపిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు ఏర్పడుతున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపరన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, జూన్ 9: సుతారిపల్లికి చెందిన భూదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సంఘ సేవకుడు మోహన్ నాయక్ పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశాడు.

## మైనార్టీలను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

టేక్మాల్, జూన్ 9: సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో ముస్లిం, మైనార్టీలకు అన్యాయం చేస్తున్నారని ముస్లిం, మైనార్టీ జిల్లా ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎ సలీం అన్నారు. మంత్రివర్గంలో ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడంతో ముస్లిం, మైనార్టీ ప్రజలు కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్నారన్నారు. తమను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, సామాజిక సమీకరణాల్లో భాగంగా ఒక్కరికీ మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రిగా ఉన్నత పదవుల్లో పెద్దపీట వేశారన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

నిజాంపేట, జూన్ 9: భూ సమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కల్వకుంటలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో రైతులు దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐ ప్రీతి, ఇమాద్, మాజీ సర్పంచ్ నారాగౌడ్, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి తదితరులు ఉన్నారు.

# మూలుగుతున్న ధాన్యం

- వానకు తడిసి, ఎండకు ఎండుతున్నా పట్టించుకోని అధికారులు
- కుప్పపోసి రోజులకొద్ది ఎదురుచూపులు



చిలిపిచెడ్: చండూర్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడుస్తున్న ధాన్యం



రేగోడు: మండల కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని సరిచేస్తున్న రైతులు

చిలిపిచెడ్, జూన్ 9: వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని కేంద్రంలో ఇంకా ఎన్ని రోజులు ఉంచాలని, ఇప్పటికే మొలకెత్తుతున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చండూర్, చిట్కుల్ ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం కుప్పలుగా పోశామని, కాంటా కోసం వేచిచూస్తున్నామని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు తడిసిందన్నారు. చిట్కుల్‌లో తడిసిన ధాన్యాన్ని తీసుకుపోవాలని తహసీల్దార్, ఐకేపీ ఏపీఎంకు చెప్పినా పట్టించుకోవాడం లేదన్నారు. ఈ విషయంలో ఐకేపీ ఏపీఎంను వివరణ కోరాగా అన్ని సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. చండూర్‌లో ఓ రైతు లేటుగా కోయడంతో లేటవుతున్నదన్నారు. చండూర్, చిట్కుల్‌లో ఎక్కువగా ధాన్యం ఉండడంతో ఈ రెండు రోజుల్లో కొంటామన్నారు.

### రేగోడ్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

రేగోడ్, జూన్9: చౌదర్‌పల్లి కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసింది. దీంతో ధాన్యంలో మాచర్ రాలేదని కొనుగోలు కేంద్రంలోని అధికారులు తమ ధాన్యం కొనడంలేదని, తమది మాత్రమే మిగిల్చారని, మిగతావారి ధాన్యం మొత్తం తరలించారని మర్పల్లికి చెందిన రైతులు భూంరెడ్డి, కుమార్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణిలో 50 దరఖాస్తులు స్వీకరణ
- కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టరేట్ పజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన 50 ఫిర్యాదులను అదనపు కలెక్టర్‌తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ధరణి 23, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 2, రుణమాఫీ 2, ఇతర సమస్యలు-23 మొత్తం-50 దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖిత పూర్వక వివరణ అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, కలెక్టరేట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరా సౌరగిరి జల వికాస పథకం అమలు

గిరిజనుల వ్యవసాయ భూములకు నీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వారి భూముల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా ఇందిరా సౌరగిరి జల వికాస పథకం అమలు చేయనున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి సమావేశ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ, భూగర్భ జల శాఖ, జిల్లా అటవీ శాఖ వివిధ శాఖల అధికారులతో సౌరగిరి జల వికాస పథకంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని 18 మండలాల్లో ప్రవేశపెట్టనున్న ఇందిరా సౌర గిరి జల వికాస పథకం అమలుకు ఎంపిక చేసిందన్నారు. ఈ ఏడాది 85 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట్, వికారాబాద్ జిల్లాలకు నోడల్ జిల్లాగా మెదక్ జిల్లాగా మెదక్ ఎంపిక అయిందన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా ఉన్న పోడు భూములు వర్షాధారం ద్వారానే సాగు చేస్తుండడంతో గిరిజనులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటూ ఈ భూములకు నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో బోరు బావులను తవ్వించి, సౌర విద్యుత్ సౌకర్యం కల్పించి, డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు పనులను గిరిజన రైతాంగానికి మేలు చేస్తాయన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు కావాల్సిన పండ్ల, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, మామిడి, వెదురు మొక్కలు సిద్ధం చేసుకోవాలన్నారు. డ్రిప్ పైపులు, స్పింకర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న ఎస్పీ



దుర్గమ్మను దర్శించుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు



అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు నరేశ్

పాపన్నపేట, జూన్ 9: ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను మెదక్ నూతన ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రముఖ నటుడు నరేశ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు నరేశ్ పేరా అర్చన చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలో చేర్పించాలి



చిన్నశంకరంపేట అంగన్‌వాడీల ర్యాలీ

చిన్నశంకరంపేట, జూన్9: రెండేండ్ల నుంచి ఐదేండ్ల వరకు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అమ్మ ఒడి అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ర్యాలీ చేశారు.

### నిజాంపేటలో బడిబాట

నిజాంపేట,జూన్9: మండలంలోని ఖాసీంపూర్‌లో నిజాంపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. టీచర్ రమేశ్, పీటీఐ రోజా ఉన్నారు.

## సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి



గజగట్లపల్లిలో పట్టాలివ్వాలని నిరసన

చిన్నశంకరంపేట, జూన్9: సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గజగట్లపల్లిలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ప్రశ్నించారు. గతంలో 404 సర్వే నెంబర్లు పట్టా పాసుబుక్కులు ఇచ్చారని, దీంతో బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నామన్నారు. ధరణి కొత్తగా వచ్చిన పాసుబుక్కుల్లో తమకు ఆ సర్వే నెంబర్లను నమోదు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ మన్నన్ తెలిపారు.

## వైద్యులు సమయపాలన పాటించాలి

రామాయంపేట, జూన్9: వైద్యులు సమయపాలన పాటించి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి శివదయాల్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక సీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యులకు సూచనలిచ్చారు. రోగులకు అందుబాటులోనే ఉండాలన్నారు. అనంతరం దవాఖానలోని ల్యాబ్, మందుల స్టోర్, పేషంట్ గదులను పరిశీలించారు. దవాఖానలో అందుతున్న సౌకర్యాలను రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వుంట రామాయంపేట సీహెచ్‌సీ వైద్యుడు లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.


# చినుకు పడితే.. చిత్తడే

- ఇరుకు రోడ్డుతో ఇబ్బందులెన్నో?
- నిధులు మంజూరైనా మొదలుపెట్టని సనులు
- మెదక్ చౌరస్తా నుంచి ఎస్సీ కాలనీ వరకు రోడ్డంతా బురదమయం




రాజేంద్రనగర్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రామాయంపేట, జూన్9: పట్టణంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అడుగుతీసి అడుగు వేద్దామంటే బురద. ఒక వాహనం వెళ్తుంటే మరో వాహనం పక్కన నిలవాల్సిందే. పాదాచారుని పరిస్థితి అంతే. ఒళ్లంతా బురదతో ఇంటికి వెళ్లాల్సిందే. రామాయంపేట మెదక్ చౌరస్తా నుంచి ఎస్సీ కాలనీ వరకు రెండు కిలోమీటర్ల మేర ఇరుకు రోడ్డు. సిద్దిపేట రోడ్డు, రాజేంద్రనగర్, మహంకాళీ కాంప్లెక్స్, గాంధీ రోడ్డు, మార్కెట్ రోడ్లపై నీళ్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కొన్ని అడ్డంకులతో పనులు నిలిచి పోయాయి. రామాయంపేటను బీఆర్‌ఎస్ ప్రభు త్వం పురపాలికగా, రెవెన్యు డివిజన్‌గా మార్చింది. పట్టణంలోని రోడ్లకు నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుని రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.



రామాయంపేటలోని రోడ్డు దుస్థితి



సిద్దిపేట రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

## ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



రోడ్డును ధ్వంసం చేసి, అడ్డంగా వేసిన బండరాళ్లు

వెల్దుర్తి, జూన్ 9: రోడ్డు పక్కన విలువైన ప్రభుత్వ భూమిని ఇరుపక్కలా ఉన్న వ్యక్తులు కబ్జాకు యత్నిస్తూ, భూమిలో ఉన్న రోడ్డును ధ్వంసం చేసి, బండరాళ్లు అడ్డువేశారు. మండలంలోని అందుగులపల్లి సమీపంలో కౌడిపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు వెంబడి ప్రభుత్వ అసైన్డ్ భూమిలో బండ ఉంది. దీనిలో నుంచి ఎన్నో ఏండ్లుగా వ్యవసాయ పొలాలు, అడవిలోకి వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉంది. దీనికి ఇరుపక్కలా ఉన్న వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తూ చెరో పక్క నుంచి మట్టిని పోస్తూ, చదును చేస్తూ ఆక్రమిస్తున్నారు. అసైన్డ్‌భూమిలో ఉన్న మట్టి రోడ్డును సోమవారం ట్రాక్టర్‌తో ధ్వంసం చేసి, రోడ్డు వెంబడి వెళ్లకుండా బండరాళ్లను అడ్డుగా వేశారు. గ్రామస్తులు కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వేరేవాళ్లు కబ్జాకు చేస్తున్నారు, తాను కూడా కబ్జా చేస్తానని దబాయించాడు. రెవెన్యూ అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గంటలో బాలిక ఆచూకీ లభ్యం



బాలికను తల్లికి అప్పగిస్తున్న ఎస్సై లింగం

నర్సాపూర్, జూన్ 9: తప్పిపోయిన బాలిక ఆచూకీని గంటలో ఛేదించి, బాలికను తల్లికి అప్పగించిన ఘటన నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కాట్రోత్ వసంత తన కూతురు అక్షి (6)ని సోమవారం కొట్టింది. దీంతో బాలిక అలిగి ఇంటి నుంచి పారిపోయింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా కానిస్టేబుళ్లు మోహన్, వెంకన్న గంటలోనే బాలికను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలిక తల్లిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బాలికను ఎస్సై అప్పజెప్పారు.


## వెల్దుర్తిలో దుకాణాల మూసివేత



వెల్దుర్తిలో మూసి ఉన్న దుకాణాలు

వెల్దుర్తి, జూన్ 9: వెల్దుర్తిలో మార్వాడీలు కొత్త దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం వర్తక, వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పలువురు యజమానులు మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఉన్న మార్వాడీ దుకాణాలు మాత్రమే ఉండాలని, కొత్తగా ఏర్పాటు చేయవద్దని కొన్నేండ్ల క్రితం తీర్మానించినట్లు తెలిపారు. మరో వ్యక్తి కొత్త దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి యత్నించగా, దుకాణాల యజమానులు నిరసన తెలిపారు.

## ఘనంగా శివాజీ పట్టభిషేక దినోత్సవం



రామాయంపేట, జూన్ 9: హిందూ సామ్రాజ్య వాద స్థాపనకు కృషి చేసిన మరాఠా యోధుడు శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని రామాయంపేటలో ఘనంగా నిర్వహించారు. శివాజీ యువసేన అధ్యక్షుడు కన్నపురం కృష్ణాగౌడ్, శంకర్‌గౌడ్, దామోదర్‌రావు సోమవారం స్థానిక మెదక్ చౌరస్తాలోని ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవాత్ మహేశ్, బొందుగుల రాజు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా బోనాల ఊరేగింపు



వెల్దుర్తిలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

వెల్దుర్తి, జూన్ 9: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. సోమవారం పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు మహిళలు పట్టువస్త్రాలు సమర్పించారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగించారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి

రామాయంపేట, జూన్ 9: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని లేకుంటే జరిమానాలు, కేసులు తప్పవని సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. సోమవారం రామాయంపేట జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేసి వాహన డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. వాహనానికి సంబంధించిన కాగితాలు, సీట్ బెల్టు, బైకులు నడిపిస్తే హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సులు వెంటే ఉండాలన్నారు. సీఐ వెంట ఎస్సై.బాలరాజు సిబ్బంది ఉన్నారు.

## మెదక్ డయాగ్నోస్టిక్ హబ్‌లో షార్ట్‌సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నిచర్

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): మెదక్ దవాఖానలోని ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలో షాట్ సర్క్యూట్ జరిగింది. శని, ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం ల్యాబొరేటరీ సిబ్బంది కార్యాలయంలోకి వెళ్లి చూడగా ఫర్నిచర్లు, కంప్యూటర్, ఇతర వస్తువులు మంటల్లో కాలిపోతున్నాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేసింది. ల్యాబొరేటరీలో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు పూర్తిగా కాలిపోయాయి. ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ గదుల్లో పొగ చేరడంతో గోడలన్నీ పొగచూరాయి. సుమారు మూడు లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు సూపరింటెండెంట్ సునీత తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామాయంపేటలో పూర్వ విద్యారులు, గురువులు

రామాయంపేట, జూన్ 9: రామాయంపేట ఉన్నత పాఠశాలలో 1999-2000 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ రిసార్టులో కలుసుకున్నారు. అప్పటి గురువులను ఒకే వేదికమీదకు తీసుకొచ్చి సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ఒక నిధిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నిధి ద్వారా వారి పేద విద్యార్థులను ఆదుకుంటామన్నారు. గురువులు నవాత్ సురేశ్, దేవేందర్, సురేశ్, ఏగొండ, చక్రవర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేశ్, ఆశమౌళిని సన్మానించారు.

## వైరు తెగిపడి పాడిగేదె మృతి

పాపన్నపేట, జూన్ 9: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని పొమ్లాతండాలో చోటుచేసుకుంది. మెగావత్ నరేశ్‌కు చెందిన పాడిగేదె పైన సోమవారం విద్యుత్ వైరు తెగి పడింది. దీంతో పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

నర్సాపూర్, జూన్ 9: అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో దీపిక పేర్కొన్నారు. 30 కిలోల బస్తా ధర రూ.2137, ఒక బస్తా 2.5 ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. అవసరమైన రైతులు నర్సాపూర్ వ్యవసాయ కార్యాలయానికి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో వచ్చి విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మేనేజర్ భవానీ

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 9: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ మేనేజర్ భవానీ అన్నారు. సోమవారం 16వ వార్డులో మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించారు. పిచ్చి మొక్కలను తొలిగించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ చెత్త వాహనంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ధర్నా

చిన్నశంకరంపేట, జూన్9: ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

## టీ లింగంపల్లిలో రెవెన్యూ సదస్సు



రేగోడ్, జూన్ 9: టీ లింగంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించామని తహసీల్దార్ దత్తారెడ్డి తెలిపారు. మొత్తం 78 అప్లికేషన్లు వచ్చాయని, వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆఐ ఫిరోజ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.